# పిట్ట కథ

శ్రీ కలువకొలను సదానంద

అంమలో ఏముందో ఎదుటి వారికి తెలియదు.

ఆ ప్యాకెట్టు చూడ ముచ్చటగా వుంది. పసుపుపచ్చని ఉల్లిపొర కాగితంతో, ఎర్రటి సిల్కు రిబ్బనుతో—కొత్త పెళ్లి కూతురిలా వుంది.

ఉరకలువేసే యౌవనంలాగా ఉల్లాసంగా పరుగిడుతూంది రైలు. ఉదయభానుడు మబ్బులమీద వెండిబెత్తం ఝుళిపిస్తున్నాడు. నీ రెండలో మిసమిసలాడుతూ ముసిముసినవ్వులు నవ్వుతున్న పైరుపచ్చలు కళ్లకు చల్లదనాన్నిస్తున్నాయి. ఆ పైరుపచ్చల కమ్మని వాసన చల్లగాలితో జతకట్టి రైలు పెట్టెల్లోకి చొరబడి ప్రయాణీకుల గుండెలకు హుషారు నిస్తున్నాయి.

రైలుపెట్టెలో—కిటికీ ప్రక్కన ఓ యువకుడు కూర్చుని వున్నాడు. వయస్సు దాదాపు పాతికేళ్లుండవచ్చు. మడతలు చెరగని యిస్త్రీ బట్టలు తొడుక్కుని వున్నాడు. అతడి కళ్లు పసిపాప కళ్లకు మల్లే అందంగా, అమాయకంగా వున్నాయి. అతని చేతిలో ఓ కాగితం వుంది. అది పెళ్లి పత్రిక. కొన్ని క్షణాల క్రితం అది అతడి చొక్కా జేబులో వుండింది. ఇంకెవరగా చూడటానికి వీలులేకుండా అతడు దాన్ని ఒళ్లో పెట్టుకుని, అప్పుడప్పుడూ అందులోకి చూచి సన్నగా—చాల సన్నగా నవ్వుకుంటున్నాడు. ఆ నవ్వు అంతలోనే మాయమై పోగా, తల ప్రక్కకు త్రిప్పి కిటికీలోంచి ఏ దూర తీరాలనో చూస్తున్నాడు.

...అతని ప్రక్కనే ఆ ప్యాకెట్టు వుంది.

అతని ఎదుట మరో వ్యక్తి కూర్చున్నాడు. అతని క్రాపు చెవుల దగ్గిర కాస్త నెరిసిపోయి వుంది. వయస్సు—ఆ యువకుడికంటే పదిహేనేళ్లు ఎక్కువే వుండవచ్చు. అతని చంకలో విలువైన కెమెరా ఒకటి వ్రేలాడుతోంది. అతని చూపులు— పరుగిడుతూన్న సుందర దృశ్యాలమీదికి, ఎదుట కూర్చున్న యువకుడి మీదికి ఎగురుతూ, యువకుడి ప్రక్కనున్న ప్యాకెట్టు మీదికి మళ్లీ మళ్లీ వచ్చి వాలుతున్నాయి.

వాళ్లిద్దరూ ఐదు నిమిషాల క్రితం కాస్త ముందు వెనుకగా చిత్తూరులో రైలెక్కారు. ఇద్దరూ కొద్దిపాటి ముఖపరిచయంవున్న వాళ్లేమో—ఒకరినొకరుచూచి చిరునవ్వు నవ్వుకున్నారు.

ఆ పెట్టెలో—వాళ్లున్న అరలో ఇంకెవరూ లేరు.

కెమెరా వుంచుకున్నతను చిన్నగ దగ్గి, కుతూహలంగా అడిగాడు. 'ఆ ప్యాకెట్టులో ఏముంది... రాజారావ్?'

యువకుడు ఉలికిపడి తలపైకెత్తాడు. బోగీ అంతా కలయజూస్తూ 'ఎవర్నండీ? నన్నేనా?... నా పేరు రాజారావ్ కాదండీ, రాజారాం' అని, పెళ్లి పత్రిక మడిచి జేబులో వుంచుకుని, ప్రక్కనున్న ప్యాకెట్టును చేతిలోకి తీసుకుని చిరునవ్వు నవ్వాడు.

'మా చెల్లాయి పనండీ యిది! ఇందులో ఏముందో అంత సులభంగా తెలియదు మరి! ప్యాకెట్టు లోపల ప్యాకెట్టు. ప్యాకెట్టు లోపల ప్యాకెట్టు...పొరలన్నీ అలా విప్పుతూ పోతే, ఆఖర్న...అబ్బే, ఇప్పుడు చెప్పకూడదు లెండి!'

'నాకు తెలుసులే! వెండిపాలాడ కదూ?'

రాజారాం అనబడే ఆ యువకుడు ఔననలేదు' కాదనలేదు.

'పిలాడ కాకుంటే, ఓ బుల్లిపాపాయి బొమ్మ!'

రాజారాం కంఠంలో కొంటెనవ్వు తప్ప, జవాబు లేదు.

'అదీ కాదంటే, పెళ్లికొడుక్కీ, పెళ్లికూతురుకీ తగూ పెట్టటానికి ఒకే ఒక చాక్లెట్! అంతే కదూ?'

'అబ్బే! క్షమించాలి! మీరు మరీ మొహమాట పెట్టేస్తున్నారు...పూర్తిగా విప్పేవరకు ఎవరితోనూ చెప్పకూడదని మా చెల్లాయి ఒట్టేయించుకుంది.'

రాజారాం ఆ రెండో మనిషిని పేరుపెట్టి సంబోధించటం లేదు. బహుశా అతని పేరేమిటో స్పష్టంగా తెలిసివుండకపోవచ్చు.

రైలు ముత్తిరేవుల స్టేషన్‌లో ఆగి, మళ్లీ తొందర తొందరగా కదిలింది. ఫోటోగ్రాఫరు రిస్టువాచీలోకి చూచుకుంటుంటే, 'టైం ఎంతయిందండీ?' అని అడిగాడు రాజారాం.

'ఆరూ, యాభై!'

'ఏడున్నరకల్లా పాకాలకు వెళ్ళిపోవచ్చు కదూ?'

'రైల్వే టైంటేబిల్ ప్రకారమే అయితే!'

'ఫరవాలేదు. ముహూర్తం ఎనిమిది గంటలకు!'

'ఎక్కడ పెళ్ళి? పాకాలలోనేనా?'

'పాకాల దగ్గిరే—గొల్లపల్లి.'

ఏవో ఆలోచనలతో ఫోటోగ్రాఫరు కనుబొమలు ముడిపడ్డాయి. 'గొల్లపల్లిలోనా! ఎవరి పెళ్ళికి?'

'చిలకమ్మ పెళ్ళికి!'

ఫోటోగ్రాఫరు కొంతసేపు మౌనంగా వుండి, మళ్ళీ ప్రశ్నించాడు: 'అంటే నువ్వు పెళ్ళికూతురి వైపు చుట్టమన్న మాట?'

సరైన సమాధానంకోసం కొంతసేపు తడుముకున్నాడు రాజారాం. 'చుట్టాన్ని కాను. అయితే చుట్టం అనిపించుకోటానికి చుట్టరికం వుండితీరాలా? వుండనవసరం లేదనుకుంటే నేను చుట్టాన్నే! ఆ మాటకొస్తే చుట్టంకంటే ఎక్కువే!'

'తమాషాగా వుంది! అయితే, ఆ అమ్మాయి నీ స్నేహితురాలా?'

'ఆ అమ్మాయికి నేను స్నేహితుణ్ణి! ఆమె డేగలపాలు కాకుండా రక్షించిన వాణ్ణి! ఆమెకు యిక ఏలాంటి అపాయమూ వుండదు. ఆమె తల్లిదండ్రులు 'హరీ' మనేంతవరకూ నన్ను స్మరిస్తూ వుంటారు. ఇప్పుడామె పెళ్లికి వెడుతున్న నాకు రెండు వారాల క్రితంవరకు చిలకమ్మ ఎవరో తెలియదు. అంతకు ముందెప్పుడూ ఆమెను నేను చూడలేదు...అదంతా ఓ చిత్రమైన కథలెండి...'

కథ వినడానికి కుతూహలం చూపుతున్నవాడిలా ఫోటోగ్రాఫరు ముందుకు వంగి కూర్చున్నాడు. రాజారాం సిగ్గుపడుతూ, మధ్య మధ్య చిరునవ్వులు నవ్వుతూ చెప్పసాగాడు.

కొత్తకోటనుంచి అతని చెల్లాయికి ఓ సంబంధం వచ్చింది. వరుణ్ణి, వియ్యాలవారి స్థితిగతుల్ని చూచి వద్దామని రెండు వారాలక్రితం అతను కొత్తకోటకు వెళ్ళాడు. వెళ్లినపని పూర్తి చేసుకుని, ఆ రాత్రి రైల్వేస్టేషన్ చేరుకున్నాడు. రైలు తొమ్మిది గంటలకు వచ్చింది. అతను ఓ చిన్నపెట్టెలోకి ఎక్కాడు. ఆ పెట్టెలో రెండు అరలున్నాయి. తిరుపతినుండి తిరిగి వస్తున్న ఓ కన్నడ కుటుంబం మొదటి అరను ఆక్రమించుకుని వుంది. లోపలి అరలో—మూసిన కిటికీ ప్రక్కన ఓ పద్దెనిమిదేళ్ల అందమైన అమ్మాయి కూర్చుని వుంది. ఆమెకు కాస్తదూరంగా యిద్దరు మోటురకం యువకులు కూర్చుని వున్నారు. రాజారాం చెక్కగోడకు ఆనుకుని ముందర దారిలోనే నిలబడ్డాడు.

లోపలి అరలో కూర్చున అమ్మాయి ఒంటరి ప్రయాణీకురాలన్న విషయం—కొన్నిక్షణాల తర్వాత అవగతమైంది అతనికి.

ముందర అరలో కూర్చున్న వాళ్లు తమలో తాము కన్నడంలో ఏమిటో అసహనంగా మాట్లాడుకుంటున్నారు. వాళ్ల అసహనానికి కారణం లేకపోలేదు. లోపలి అరలో ఆ అమ్మాయి దగ్గిర చేరిన యువకు

లిద్దరూ ఆమెను ఏడిపించుకు తింటున్నారు. బూతు పాటలు పాడుతున్నారు. మోటుసరసాలు విసురుతున్నారు. 'మీదేవూరు, ఎక్కడికెళ్తున్నావు, తోడెవరూ లేరా, మా వెంట వస్తావా' అంటూ గాలం వేస్తున్నారు. ఆ అమ్మాయి మౌనంగా వుంది. ఒకవైపు కోపంతో వుడికి పోతున్నా–వాళ్ళ ఆకతాయితనాన్ని భరిస్తూ నిస్సహాయంగా కూర్చుంది.

ఉన్నట్లుండి ఆమె గొంతు బోగీ అంతా మారుమ్రోగింది. 'ఛీ. పశువులారా! అవతలికి పోతారా, రైల్లోంచి దూకమంటారా?'

రాజారాం యిక వుండబట్టలేకపోయాడు. విసురుగా లోపలి అరలోకి నడిచి, 'ఏమైంది? ఏమిటీ గోల?' అన్నాడు తీక్షణంగా. అతనితోబాటే మైసూరు వాళ్లంతా బిలబిలమంటూ పైకి లేచారు. ఆ పడుచువాళ్లిద్దరూ బొమ్మల్లా కూర్చునివున్నారు. 'ఏమైందీ? ఏమీ లేదే!' అన్నాడు ఒకడు.

'ఏమమ్మాయ్? ఏం చేశారు వీళ్లు?'

ఆ అమ్మాయి చేతుల్లో ముఖం దాచుకుని బావురుమంది. 'పైన చేతులు వేస్తున్నారు...'

'ఇదేం గ్రహచారంరా బాబూ! వుత్తపుణ్యానికే మనమీద అభాండాలు వేస్తూందే! మంచిజగజ్జాణే!' అన్నాడు ఒకడు రెండోవాడితో.

'మనం లేచినవేళ బాగా లేదు అన్నాడు రెండోవాడు.

'నేనూ గమనిస్తున్నాను మీ చేష్టలు! ఆడపిల్ల ఒంటరిగా కనిపిస్తే చాలు ..'అంటూ కళ్ళలోంచి నిప్పులు కురిపించాడు రాజారాం.

'అబ్బో! హీరో వూడిపడ్డాడురా బాబూ!'

రెండోవాడు కిసుక్కుమన్నాడు.

'లేచి అవతలికి వెడతారా, వెళ్ళరా'

'టిక్కెట్టు కొన్నాం తెలుసా? మా యిష్టం వచ్చినచోట–కూర్చుంటాం!'

'సరే! కూర్చోండి! పక్కస్టేషన్‌లో దిగి, రైల్వే పోలీసును పిలుస్తాను. తరవాత వాడి కిష్టమైనచోట కూచోబెడతాడు.'

ముత్తిరేవుల స్టేషన్‌లో రైలు ఆగగానే వాళ్ళిద్దరూ బుద్ధిమంతుల్లా రైలు దిగి, మరో పెట్టెవైపు నడిచారు.

రాజారాంకు అర్థంకాని భాషలో కన్నడులంతా అతన్ని అభినందించారు.

కట్టుబట్టలతోవున్న ఆ అమ్మాయి కెదురుగా కూర్చున్నాడు, అతను. 'తోడులేకుండా రాత్రిపూట యిలా ప్రయాణం చేయవచ్చా?' అన్నాడు.

ఆమె కొంగుతో కళ్ళొత్తుకుని నేల చూపులు చూడసాగింది.

అతడు ఆమె మీద ప్రశ్నలవర్షం కురిపించాడు

'ఏ వూరు మీది?'

'ఎక్కడికి వెళ్తున్నావు?'

'నీ పేరేమి?'

'మీ అమ్మా నాన్నా ఎవరు?'

'ఎక్కడ రైలెక్కావు?'

ఒక్క ప్రశ్నకు కూడా ఆమె జవాబు చెప్పలేదు.

'ఇంట్లోనుంచి పారిపోతున్నావా?' అంటూ అతను ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు.

కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే, ఆమె తలవంచుకుంది.

'ఎందుకు పారిపోతున్నావ్?'

అతనివైపు కోపంగా చూచి 'చావటానికి!' అంది.

'చావటానికి యింతదూరం రావాలా?'

అతను ఒకటి రెండు నిమిషాలు మౌనంగా వుండి యిలా అన్నాడు: 'చూడమ్మాయ్! చేతులు కాలిన వెనుక ఆకులు పట్టుకుని లాభం లేదు. ముందే బాగా ఆలోచించుకో! ఇలా రైల్లో కూర్చుని ఎందాకా వెడతావు? ఎక్కడుంటావు? ఈ రాత్రి ఎక్కడ గడుపు

తావు? ఈ ఒక్క రాత్రితోనే బ్రతుకు తెల్లారిపోదు. ఇలాంటి పాడురాత్రులు ఎన్నో వున్నాయి. ఆడది ఒంటరిగా బతకటం తమాషా కాదు. నేనేదో మాయ మాటలు చెబుతున్నా ననుకోకు. లోకంలో అందరూ చెడ్డవాళ్ళు కాదు. మంచివాళ్ళు కూడా కొంద రున్నారు. ఈ రాత్రి మా యింట్లో వుండు. మా అమ్మ, మా చెల్లాయి నీకు తోడుగా వుంటారు. నువ్వు ఎప్పుడు వెళ్ళిపోవాలంటే అప్పుడు వెళ్ళిపోవచ్చు... నీ మీద ఈగ వాలదు...ఏమంటావ్?'

'ఉహూఁ!' అందామె.

చిత్తూరుస్టేషన్‌లో రైలు ఆగింది. అతను పైకి లేచాడు. ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూస్తూ కొంతసేపు నిలబడ్డాడు. రైలు కూత వేసింది.

'సరే! నేను దిగిపోతున్నాను. జాగర్త!' అనేసి, అతను రైలు దిగాడు.

కదులుతోన్న రైలులోంచి ఆమె గబుక్కున క్రిందికి దిగింది.

'టిక్కెట్టుందా?'

'లేదు.'

అతడు గేటువైపు వెళ్ళలేదు. ఆమెను వెంట బెట్టుకుని రైలుపట్టాల ప్రక్కగా నడిచి రోడ్డు మీదికి వచ్చాడు. కొంగారెడ్డిపల్లిలో వున్న తన యింటికి ఆమెను తీసుకుపోయాడు.

జరిగిన సంగతంతా తల్లికి చెల్లాయికి చెప్పాడు. ఆ అమ్మాయి మొహమాటపడుతూ భోజనం చేసింది. అతని తల్లి, చెల్లెలు చెరొక వైపున అంగరక్షకుల్లా పడుకోగా, ఆదమరచి నిద్రపోయింది.

ఆ రాత్రంతా అతను నిద్రపోలేదు. ఏ చిన్న అలికిడి వినిపించినా, ఆ అమ్మాయి వెళ్లిపోతున్న దేమోననే శంకంతో లేచి కూర్చునేవాడు.

తెల్లవారింది...

ఇంతవరకూ చెప్పి హఠాత్తుగా ఆగిపోయాడు రాజారాం. ఏవో జ్ఞాపకాలు అతని కథనానికి అంత రాయం కలిగించినట్లున్నాయి.

'ఆపేశావేం?' అన్నాడు ఫోటోగ్రాఫరు.

'మా చెల్లాయి కొంటెతనం గుర్తొచ్చింది. అది పుత్తవెర్రి బాగులపిల్లలెండి. ఆ రాత్రి కంటి మీద కునుకులేక ఆలస్యంగా నిద్రలేచాను మా చెల్లాయి ఆ అమ్మాయికి జడవేస్తూ కూర్చుని వుంది. నేను మంచంమీద కూర్చుని కళ్ళు నులుముకుం టుంటే 'నాకు పెళ్లి కొడుకును చూచివస్తానని సాకు చెప్పి, కుందనపు బొమ్మలాంటి వదిన్ని వెంటబెట్టు కొస్తావా అన్నయ్యా' అంటూ పరాచికాలాడింది. ఆ మాట యింకోసారి అంటావా?' అంటూ దాని చెవి నులిమేశాను...'

...ఆ రోజు రాజారాం ఫ్యాక్టరీకివెళ్లి, సాయం కాలం యింటికి తిరిగి వచ్చాడు. ఆ లోపున ఆ అమ్మాయి తాలూకు రహస్యం ఒక్కటిమాత్రం తెలుసుకో గలిగింది అతని చెల్లాయి. అదేమిటంటే— ఆమె పేరు చిలకమ్మ అని.

చిలకమ్మ ముఖంలో బెంగ మాసిపోయింది.ఇంటి పనుల్లో తానూ పాలుపంచుకోసాగింది. నవ్వుతూ హుషారుగా కబుర్లు చెప్పుకుంటూ ఆ కుటుంబంలో తానొక వ్యక్తిలాగా కలిసిపోయింది.

రెండు రోజుల్లో ఆమె కథంతా పూర్తిగా తెలుసుకోగలిగాడు రాజారాం. అన్నీ అతని చెల్లాయికి ఆమె స్వయంగా చెప్పినవే!

సిరిసంపదలు లేకపోయినా, పనీపాటూ చేయ కుండా బ్రతుకు వెళ్ళదీసే బుద్ధిశాలురు ప్రపంచంలో కొందరున్నారు. పాకాల శివార్లలోని గొల్లపల్లిలో కూడా అలాంటి వ్యక్తి ఒకడున్నాడు. అతని పేరు వీరభద్రయ్య. అతని కూతురే చిలకమ్మ. చిలకమ్మకంటే పెద్ద వాడొకడు, చిన్నవాడొకడు వున్నారు. పెద్దవాడెప్పుడూ ఇంటిపట్టున వుండడు. ఇంటి గొడవలు పట్టించుకోడు. క్లబ్బులు అని పిలువబడే మారుమూల గదుల్లో కూర్చుని చీట్లపేక లాడుకుంటూ వుంటాడు. డబ్బు లేనప్పుడు గ్లాసెడు టీనీళ్ళకోసం— కనిపించిన వాళ్ళ నల్లా బతిమాలుకుంటూ వుంటాడు. చిన్నవాడు కాస్త

బుద్ధిమంతుడు. సారాయి అంగడిలో పనీపాటూ చేసుకుంటూ నెలనెలా నాలుగు రాళ్ళు తెచ్చి యిస్తున్నాడు.

చిలకమ్మ తల్లి భర్తకు వంతపాటపాడే ఉత్తమా ఇల్లాలు. కూతురి పెళ్ళి విషయంలో కూడా ఆమె అలాగే వంతపాడింది. ఆ వూళ్ళోనే వెంకట శివప్రసాదు అనే వాడికి ఆమె నిచ్చి పెళ్ళి చేయాలని అనుకున్నారు వాళ్ళు. వెంకట శివప్రసాదుకు పిల్ల నచ్చింది. అయితే పిల్లకు వెంకటశివప్రసాదు నచ్చలేదు. అతనిపట్ల ఆమెకు కొన్ని అభిప్రాయాలున్నాయి అతడు నలభై దాటినవాడు, రెండో పెళ్లివాడు, ముగ్గురు పిల్లల తండ్రి, పచ్చితాగుబోతు. ఊరినిండా అతనికి ముండలున్నారు.

ఆ వరుడు తనకు వద్దన్నది చిలకమ్మ. 'ఎందుకు వద్దు? డబ్బులేనివాడా? ఆస్తిలేనివాడా? ఇంతమంచి సంబంధం ముల్లోకాలు వెతికినా దొరుకుతుందా? నోరుమూసుకో!' అన్నారు తల్లిదండ్రులు.

చిలకమ్మ ఏడ్చింది. ఆమె ఏడుపు అరణ్యరోదనమే అయింది. ఇక గత్యంతరం లేక ఎవరికీ తెలియకుండా రైలెక్కింది.

చెల్లెలు చెప్పగా ఈ సంగతులన్నీ విన్నాడు రాజారాం. అతనికి ఈ కాలపు ఆడపిల్లల నిర్ణయాల మీద సదభిప్రాయం లేదు. చిలకమ్మలాంటి అర్భకురాలేమిటీ, తలలు పండిన తల్లిదండ్రుల మాటల్లో తప్పులు పట్టడమేమిటీ? బిడ్డల బాగోగులు కన్నవాళ్ళకు కదా తెలుసు? చిలకమ్మ వట్టి అమాయికపు పిల్ల. ఎవరో ఆమెను హడలగొట్టేసి వుంటారు లేనిని, పోనివి వూహించుకుని అనవసరంగా బెంగపడి పోయి వుంటుంది. ఆ వెంకట శివప్రసాదనే వాడు రెండో పెళ్లి వాడయితే కావచ్చుగాక; ఆ నేరానికే— తాగుబోతనీ, ముండల్ని మరిగిన వాడనీ వాడినెత్తిన అపవాదులు వెయ్యాలా?

చిలకమ్మను యింటికి తీసుకువచ్చి రాజారాం ఒక పెద్ద బాధ్యతను నెత్తిన వేసుకున్నాడు. అదేమిటంటే—ఆమెను సురక్షితమైన చోటికి చేర్చివేయడం. మూడో రోజున ఆమెకు తెలియకుండానే వీరభద్రయ్యకు ఉత్తరం వ్రాశాడతను. ఉత్తరం వ్రాసిన మరునాడే చిలకమ్మ తల్లిదండ్రులు, తమ్ముడు రెక్కలు కట్టుకునివచ్చి వాలారు.

'బాబూ! నీ మేలు జన్మలో మరిచిపోను.' అంటూ రాజారాం చేతులు పట్టుకున్నాడు వీరభద్రయ్య.

'చచ్చి నీ కడుపున పుడతాను నాయనా' అంది అతని భార్య.

చిలకమ్మ అతన్ని బూతులు తిట్టింది. 'కసాయివాడు! నన్ను నమ్మించి గొంతుకోశాడు. తప్పించుకు పోతున్న దాన్ని లాక్కొచ్చి మళ్లీ బోనులోకి తోశాడు. మాయలమారి!...వీడి ముఖం మండ!...'

ఆమె తల్లిదండ్రులు యింటికి రమ్మంటే, రానంటే రానని మొండికేసింది ఆమె. 'నా గొంతుకు ఉరితాడు వెయ్యటానికా రమ్మంటున్నారు? ఇక్కడే ఏ నూతిలోనైనా తోసేసిపొండి. నా కొద్దు' ఆ పెళ్లి' అంటూ ఏడ్చి గోలపెట్టింది.

'పిచ్చిపిల్ల! నువ్వు యింతగా వద్దంటుంటే, మేం మాత్రం నిన్నెందుకు బలవంతం చేస్తాం? నిన్ను చంపుకోవడం మాకు యిష్టమనుకున్నావా? వద్దులే ఆ పెళ్లి!' అంటూ వూరడించింది ఆమె తల్లి.

'ఇక పెళ్లి మాసెత్తితే ఒట్టు!...నీకు నచ్చినవాడెవడొస్తాడో, వాణ్ణే చేసుకుందువుగానీ!' అన్నాడు వీరభద్రయ్య.

చిలకమ్మ శాంతించింది.

ఆ రోజే తన వాళ్లవెంట—నవ్వుతూ వెళ్లిపోయింది.

కథ చెప్పడం ఆపి, రాజారాం మైమరచి కూర్చున్నాడు. కొంతసేపటికి పరధ్యానంలోంచి తేరుకుని, చిరునవ్వు నవ్వటానికి ప్రయత్నించాడు.

'మా చెల్లాయండీ— చిలకమ్మను సాగనంపుతూ వాకిట్లో నిలబడి 'మళ్లీ రావాలి వొదినా!' అంది. చిలకమ్మ కోపగించుకోలేదు. 'దేవుడు చల్లగాచూస్తే'

అని నవ్వుతూ వెళ్ళిపోయింది. మా చెల్లాయి అలా అనడం ఏం బాగాలేదుకదూ? అది పుత్తవెర్రిబాగుల పిల్లండీ!...'

రైలు పాకాల ఔటర్ సిగ్నల్‌వద్ద కాస్సేపు ఆగింది.

రాజారాం తొందర తొందరగా అన్నాడు: ఇప్పుడీ తమాషా చూడండీ; చిలకమ్మ తనకు వెంకట శివప్రసాద్ వద్దన్నదా? నీకు నచ్చినవాణ్ణే చేసుకుందు వులే అని వీరభద్రయ్య అన్నాడా? ఇప్పుడు చిలకమ్మకు పెళ్లి జరుగుతున్నదా? వరుడు ఎవరోకాదు. సాక్షాత్తూ ఆ వెంకట శివప్రసాద నామధేయుడే! దీన్నిమీరు ఎలా కామెంట్ చేస్తారు?'

రైలు మళ్లీ కదిలేదాకా ఆలోచించాడు ఫోటో గ్రాఫరు. 'ఆడవాళ్లను అర్థం చేసుకోవడం మహా కష్టంబాబూ!...ఆమెకు వెంకటశివప్రసాద్ అప్పుడు నచ్చలేదు. ఇప్పుడు నచ్చాడు.'

రాజారాం వెంటనే ఏదో చెప్పబోయి మాను కున్నాడు. తరవాత తాపీగా యిలా అన్నాడు: 'అంతే, అంతే!...'

స్టేషన్‌లో రైలు ఆగగానే ప్యాకెట్టు చేతికి అందుకుని పైకి లేచాడు రాజారాం. అతనికంటే ముందు ఫోటోగ్రాఫరు ప్లాట్‌ఫారం మీదికి దిగాడు.

'ఇక నాకు సెలవండీ!' అన్నాడు రాజారాం, వెనుకనుంచి.

'ఆగవయ్యా బాబూ! మీ చిలకమ్మ పెళ్లికి నేనూ వస్తాను.' అన్నాడు ఫోటోగ్రాఫరు.

'మీరూ వస్తారా ?!'

'పెళ్ళికొడుకు తరఫున అర్డరొస్తే, ఫోటోలు తీయటానికి వచ్చాను. నీ ప్యాకెట్‌లో ఏముందో పెళ్ళి లోనే చూస్తాన్లే !'

'మీరు భలేవారండీ !'

ఇద్దరూ టిక్కెట్ కలెక్టరుకు టిక్కెట్లిచ్చేసి, ప్లాట్‌ఫారం కొసవరకూ నడిచి, రైలుపట్టాలన్నిటినీ దాటుకుని, ఉత్తరంవైపుగా నడవసాగారు.

ఫోటోగ్రాఫరు రిస్టువాచీలోకి చూచి 'ఏడూ, ముప్పై అయిదయింది. ఏడుమ్ముప్పావుకల్లా అక్క డుంటాం.' అన్నాడు.

మూడు ఫర్లాంగుల దూరాన గుట్ట వుంది. గుట్టప్రక్కన పల్లె కనిపిస్తోంది. గ్రాఫు కాగితంలోని వంకరటింకర గీతలా వున్న ఎగుడుదిగుళ్ళ కాలిబాట వెంబడి నడిచి పల్లెను సమీపించారు వాళ్లు.

లౌడ్‌స్పీకర్ల కోలాహలం లేదు.

పల్లెలో ప్రవేశించారు.

మంగళవాయిద్యాల హంగామా లేదు.

ఎదురుపడిన మనుషుల ముఖాల్లో నల్లని నీడలు!

వీధిలోని పచ్చని పందిరి బోసిగా కనిపిస్తోంది. పందిరి వెనుకనున్న పూరింటిలోనుంచి సన్నగా ఏడ్పులు వినవస్తున్నాయి. ఇద్దరూ జనాన్ని నెట్టు కుంటూ లోపలికి వెడుతూంటే, బయట బెంచీమీద చతికిలబడిన మధ్యవయస్కుడొకాయన రాజారాంవైపు చురచురా చూశాడు.

లోపల చలనరహితంగా పడివున్న పెళ్లికూతురి మీద వాలి ఒకస్త్రీ రోదిస్తూ వుంది

పెళ్ళి ముహూర్తం దగ్గరపడింది.

* * *

'గూటిలో చిలాకేదిరా?...

అన్నా,

గూడూ చిన్నాబోయెరా!...'

...బోగీలో బిచ్చగాడు పాటపాడుతున్నాడు.

'గార్డు ఈలవేసి ఐదునిమిషాలయింది. ఎనిమిదిమ్ముప్పావు దాటినా ఇంకా బయలుదేరి చావ నంటోంది, పాడురైలు!' అంటూ విసుక్కుం టున్నాడు ఓ ప్రయాణీకుడు.

కిటికీ దగ్గిర ఒదిగి కూర్చున్నాడు రాజారాం. ఎదురుగా ఫోటోగ్రాఫరు.

కిటికీ బయట ప్లాట్‌ఫారంమీద ఓ పదిహేనేళ్ళ కుర్రవాడు నిలుచున్నాడు. అతడి క్రాపు చిందర

వందరగా వుంది. ముఖంలో విషాదచ్ఛాయలు అలుము కుని వున్నాయి. అతడు రాజారాంవైపు చూస్తూ కొంతసేపు అలాగే నిలబడ్డాడు. చివరికి గొంతు పెగుల్చుకుని యిలా అన్నాడు: 'మా అక్కయ్యరాసిన ఉత్తరం అందలేదూ మీకు?'

'...లేదు!' రాజారాం గొంతు జీరబోయింది.

'...నేనే పోస్టుచేశాను.'

ఆ మాటకు రాజారాం ఏమీ చెప్పలేదు.

'మా అక్క ఎవర్ని పెళ్ళాడాలని పట్టు బట్టిందో తెలుసా?'

రాజారాం కళ్ళు రెపరెపలాడాయి. తలవంచు కున్నా డతను.

'అందరూ పెడచెవిని పెట్టినవాళ్లే! నెమలి కంట్లో నీళ్ళుకార్తే వేటగాడికి తాపమా?...దాని తల రాత అలావుంటే, ఎవరు మాత్రం ఏంచేస్తారులెండి...'

రైలు కూతవేసి కదిలింది. క్రమంగా వేగాన్ని పుంజుకొన్నది.

రాతి బొమ్మలా కూర్చున్న రాజారాం కొద్దిగా కదిలాడు. జేబులోంచి పెళ్లిపత్రికను బయటికి తీశాడు. దానితోబాటు ఓ పోస్టుకార్డు. వాటిలోకి తదేక దృష్టితో చూస్తూవుంటే, అతని కళ్లలో నీళ్లు క్రమ్ముకోసాగింది. మోకాళ్లను దగ్గరగా చేర్చుకుని వాటిమీద తలవాల్చి, ముఖం దాచు కున్నాడు. అతని చేతిలో వున్న కాగితాలు రెండూ జారి క్రిందపడ్డాయి.

ఫోటోగ్రాఫరు ముందుకువంగి వాటిని తీసు కున్నాడు. ఒకటి రెండు క్షణాలు తటపటాయించాడు. అయినా కుతూహలాన్ని చంపుకోలేక పోయాడు.

కార్డులో ముచ్చటగా మూడు పంక్తు లున్నా .

'ఇష్టంలేని పెళ్లి చేసుకోమంటున్నారు. నన్ను మళ్లీ ఈ పంజరంలోకి తరిమావు. నన్ను కాపాడే వాళ్లు యింకెవరున్నారు?—చిలకమ్మ.'

ఆ దస్తూరీలాంటిదే పెళ్లిపత్రిక వెనుక వైపునకూడా కనిపించింది. 'నా పెళ్లికి తప్పక రావాలి!'

పెళ్లి పత్రికలోకి చూశాడు ఫోటోగ్రాఫరు. అందులో 'వెంకటశివప్రసాద్' అనే ముద్రాక్షరాల మీద సిరాతో ఓ గీత, గీతకు కాస్తపైన అదే సిరాతో 'రాజారాం' అనే పేరు! అది చిలకమ్మ దస్తూరీకాదు. తన కలలకు రాజారాం ఆ అక్షరాలతో అలా రూపకల్పన చేశాడేమో!

పెళ్లికివస్తూ రాజారాం పట్టుకొచ్చిన ప్యాకెట్టు అతని ప్రక్కనే పదిలంగా వుంది. అందులో గుప్తంగా వున్నది ఏమిటో ఊహించగలిగాడు ఫోటోగ్రాఫరు.

దాని పేరు—ప్రేమ!

